క్లుప్తంగా

మహిళా కళాశాలలో హిందీ భాషా వారోత్సవాలు



హిందీ భాష గొప్పదనాన్ని వివరిస్తున్న కార్యక్రమ కన్వీనర్ సుధ

దాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ డిగ్రీ, పీజీ మహిళా కళాశాలలో హిందీ దివస్‌ను పురస్కరించుకుని మంగళవారం హిందీ భాషా వారోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి హిందీ భాష ఆవశ్యకత గురించి విద్యార్థినులకు వివరించారు. ఈ నెల 19 వరకు నిర్వహించే ఈ వారోత్సవాల్లో వివిధ కళాశాలలు పాల్గొంటున్నాయని తెలిపారు. కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ కె. సుధ హిందీ భాష ఆవిర్భావం, రాజభాష, జాతీయ భాష, సంపర్క్ భాషగా హిందీ గొప్పదనాన్ని విద్యార్థినులకు తెలిపారు. కార్యక్రమంలో ఇంగ్లీషు విభాగ అధ్యాపకురాలు బి. శాంతి, జె. సునీత, ఎస్వీ పద్మకుమారి, బి. రాధమ్మ, వీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

16న లలితాపీఠంలో అష్టావధానం

సీతంపేట: లలితానగర్ శ్రీలలితాపీఠంలో ఈ నెల 16, 17 తేదీల్లో కవితా మహేంద్రజాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ తెలిపారు. 16వ తేదీ సాయంత్రం 6 గంటలకు అష్టావధానం జరుగుతుందని డాక్టర్ కడిమిళ్ల వరప్రసాద్ సంచాలకులుగా, శతావధాని బులుసు అపర్ణ, పలువురు సాహితీవేత్తలు పాల్గొంటారని తెలిపారు. 17వ తేదీ సాయంత్రం 6 గంటలకు తెలుగు విజయం సాహితీ రూపకం ప్రదర్శించబడుతుందన్నారు. ఇందులో పాత్రధారులు నన్నయగా కడిమిళ్ల వరప్రసాద్, పురాణకవిగా గొర్తి సుబ్రహ్మణ్యశాస్త్రి, ప్రబంధకవిగా అబ్బిరెడ్డి పేరయ్యనాయుడు, శతకకవి పి.రామచంద్రరావు, అవధాన కవి బులుసు అపర్ణ, నాటక కవి సి.వి.వి. సత్యనారాయణమూర్తి పాల్గొంటారని తెలిపారు. రెండు రోజులు సాహిత్య కార్యక్రమాలూ పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి సమక్షంలో జరుగుతాయన్నారు.


సినీనటుల సందడి



నటుడు శత్రు, ప్రతీక్ష మిశ్రా

కొమ్మాది: ఆరిలోవలో మంగళవారం సినీనటులు సందడి చేశారు. ఇక్కడున్న ఓ ఆస్పత్రిలో జరిగిన సినిమా షూటింగ్‌లో నటి ప్రతీక్ష మిశ్రా, నటుడు శత్రు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శత్రు మాట్లాడుతూ తన సినీ కెరీర్‌లో రంగస్థలం, పుష్ప మంచి గుర్తింపునిచ్చాయన్నారు. ప్రస్తుతం ఓ సినిమాలో (పేరు ఖరారు కాలేదు) రెండో హీరోగా నటిస్తున్నట్లు ఆయన తెలిపారు. సినీనటుల రాకతో ఆస్పత్రి వాతావరణం అంతా సందడిగా మారింది.

కొత్త పెన్షన్ల పంపిణీ



పెన్షన్లు పంపిణీ చేస్తున్న సిబ్బంది

ఏయూ క్యాంపస్: స్థానిక 20వ వార్డు 157 సచివాలయం పరిధిలో కొత్తగా మంజూరైన 11 పెన్షన్లను మంగళవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు దువ్వి గోవింద్, ప్రసాదుల హేమలత, బంధవు వెంకటేష్, ఎస్.పోలారావు, ఎస్.సురేష్, తూర్పు నియోజకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర్ కిల్లాన రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే.. అడ్డుకట్ట



హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కళాకారులు (ఫైల్)



ప్లాస్టిక్ నిర్మూలనపై వినూత్న ప్రచారం చేస్తున్న కళాకారులు (ఫైల్)

ఎంత గొప్ప విషయమైనా మామూలుగా చెప్పే దాని కన్నా.. దృశ్య రూపంగా చెబితే చక్కటి ఫలితం ఉంటుంది. నాటకం, సినిమా, బుర్రకథ వంటి కళారూపాల ద్వారా సామాన్యులకు ఏదైనా చెబితే అది ఇట్టే గుర్తుండిపోతుంది. గతంలో ప్రభుత్వం సీజనల్ వ్యాధులపై ఇలాగే కళాజాతాలు నిర్వహించేది. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో మళ్లీ అలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే మంచి ఫలితం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

- సీజనల్ వ్యాధుల నివారణకు కళాజాతాల నిర్వహణ తప్పనిసరి
- గత ఫలితాలను దృష్టిలో ఉంచుకుని తిరిగి ఈ ప్రక్రియ ప్రారంభించాలి

దాబాగార్డెన్స్ : మనిషన్నాక ఎప్పుడో ఒకప్పుడు అనారోగ్యం తప్పదు. పిల్లలకు ఈ సమస్యలు మరీ అధికం. పైగా జీవన ప్రమాణాలు కనిష్ట స్థాయిలో ఉండే చోట ఆరోగ్యం అంతంత మాత్రంగానే ఉంటుందనడంలో సందేహం లేదు. ఇలాంటి వ్యాధుల గురించి సామాన్యులు, పెద్దగా చదువుకోని ప్రజలకు అవగాహన అంతంత మాత్రమే. ఈ పరిస్థితుల్లో సంక్రమించే వ్యాధులను నిర్లక్ష్యం చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నది మనకు అవగతమే. అలా అని వారికి వ్యాధుల గురించి పాఠంలా వివరిస్తే ఫలితం ఉండదు. ఈ అంశాలన్నింటిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం స్థానికులకు వినోదాన్ని కలిగిస్తూనే అవగాహన పెంచే కళారూపాలను ఊరూరా పంపి, కార్యక్రమాలు నిర్వహింపజేసేది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సీజనల్ వ్యాధులపై ప్రతి ఏటా వివిధ రూపాల్లో ప్రజలకు అవగాహన కల్పించేది. దక్షిణ నియోజకవర్గంలోని పాతపోస్టాఫీస్, అల్లిపురం భీం నగర్, ప్రసాద్‌గార్డెన్స్, జ్ఞానాపురం తదితర ప్రాంతాల్లో ఉన్న పబ్లిక్ హెల్త్ సెంటర్ల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఆయా సెంటర్ల ఏఎన్ఎంలు, ఆయాల సహకారంతో సదస్సులు నిర్వహించేవారు. సదస్సులతో పాటు మురికివాడల్లోని ప్రజలకు మరింత చేరువ అయ్యేందుకు బుర్రకథల రూపంలో కళాకారులు సీజనల్‌గా వచ్చే వ్యాధులు, తీసుకోవల్సిన జాగ్రత్తలను పాట మాదిరిగానో, కథలాగానో చెప్పేవారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న మందులపై అవగాహన కల్పించడంతో పాటు పిల్లల్లో ఐదు రకాల వ్యాధులను నియంత్రించే పెంటా వాలెంట్ వ్యాక్సిన్ ఉపయోగాలను సరదాగా వివరించేవారు. అన్నీ కథల్లా ఉండడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించేవారు. కొంత వరకైనా అవగాహనకు వచ్చేవారు. పేదసాద ప్రజలకు సీజనల్‌గా వస్తున్న వ్యాధుల గురించి అవగాహన కలిగించటం, ముందస్తు నివారణ పద్ధతులను విశదీకరించటంపై మళ్లీ దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం నగరంలో ఎక్కడ చూసినా విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. జనం జ్వరాలతో మంచం పడుతున్నారు. మురికివాడలతో పాటు పరిసరాల శుభ్రత, వ్యక్తిగత శుభ్రత లేకపోవడంతోనే వ్యాధులు వ్యాపిస్తాయన్న విషయాన్ని ప్రజలకు చెప్పడం ఎంతైనా అవసరం. దీనికి బుర్రకథ, వీధి నాటకాల ప్రక్రియను మళ్లీ ప్రారంభిస్తే ఫలితం ఉంటుందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

చర్యలు చేపడుతున్నాం..

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించే విషయమై చర్యలు చేపడుతున్నాం. ముఖ్యంగా మురికివాడ ప్రాంతాల్లో కళాజాతాలు, వివిధ రూపాల్లో అవగాహన కల్పించనున్నాం. సీజనల్ వ్యాధులు, అవి రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై ప్రజలకు సులువుగా అర్థమయ్యే రీతిలో ఈ కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటాం. అందుకు సంబంధించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం.

–డాక్టర్ పి. జగదీశ్వరరావు,
జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలి



కమిటీ సభ్యులతో ఏర్పాట్లపై చర్చిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: స్థానిక సీతంపేట కూడలిలో కొలువైన దుర్గాగణపతి ఆలయంలో ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న వినాయక నవరాత్రి మహోత్సవాలను విజయవంతం చేయాలని 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ అన్నారు. ఉత్సవ ఏర్పాట్లపై మంగళవారం సాయంత్రం ఆలయం వద్ద కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. వినాయక చవితి రోజు దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాట్లు చెయ్యాలన్నారు. అలాగే ఏటా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాలు ఈసారి కూడా ఘనంగా నిర్వహించాలని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. కమిటీ సభ్యులంతా సమన్వయంతో ఉత్సవాలు విజయవంతమయ్యేలా కృషి చెయ్యాలన్నారు. విద్యుత్ దీపాలంకరణ, ఆలయ డెకరేషన్, స్టేజి ప్రోగ్రామ్స్, ప్రతి రోజూ ఉదయం హోమాలు, సహస్రనామార్చాన, అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, ప్రసాదాల నివేదన, ఊరేగింపు ఏర్పాట్లు, అన్నదాన కార్యక్రమం తదితర ఏర్పాట్లపై కమిటీ సభ్యులతో చర్చించారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం ఊర్వశి జంక్షన్ కూడలి రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్యస్వామి ఏకాంత ఆలయంలో శ్రావణ మాస శుద్ధ త్రయోదశి మంగళవారాన్ని పురస్కరించుకుని శరవణ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త దేవాల రాజు ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యస్వామికి స్కంధ పూజలు నిర్వహించారు. అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్రనామం, విభూది, పుష్పలతో అర్చనలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

రహదారులు మెరుగు.. అభివృద్ధి పరుగు

- పలు ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం
- స్మార్ట్ వార్డులే లక్ష్యంగా పనులు



కంచరపాలెంలో బీటీ రహదారి పనులను పర్యవేక్షిస్తున్న ఈఈ ప్రసన్న రెడ్డి

కంచరపాలెం: బీఆర్‌టీఎస్ కంచరపాలెం రహదారి నుంచి ఎన్ఏడీ అటు జ్ఞానాపురం వరకు బీటీ రహదారులు సుందరీకరణకు నోచుకుంటున్నాయి. జోన్–5 పరిధిలో ఇంజినీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణలో నాణ్యమైన తారురోడ్ల నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి. కంచరపాలెం, తాటిచెట్లపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ కూడలి, 104 ఏరియా, మర్రిపాలెం, కరాసా, జ్ఞానాపురం ప్రాంతాల్లో రహదారులు మెరుగుపరుస్తున్నారు. టీడీపీ ప్రభుత్వంలో జరగని అభివృద్ధి ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరుగుతుండడంతో వాహన చోదకులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్‌టీఎస్ రహదారుల్లో రోడ్లు గుంతలు పడడం, ట్రాఫిక్ నిబంధనలకు రక్షణ చర్యలు లేకపోవడంతో అనేక ప్రమాదాలు చోటు చేసుకునేవి. రోడ్డు ప్రమాదాల్లో అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం అభివృద్ధి పనులతో ఎలాంటి ప్రమాదాలకు తావు లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నారు. సుమారు రూ. 2.90 కోట్ల వ్యయంతో బీటీ రోడ్ల ఫుట్‌పాత్‌లు, డివైడర్లు, ట్రాఫిక్ సిగ్నల్స్, బారికేడ్లు తదితర అభివృద్ధి పనులు జరిగాయి. జోన్–5 జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, ఇంజినీరింగ్ ఈఈలు ప్రసన్నరెడ్డి, శ్రీనివాసరావు, కంచరపాలెం ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మళ్ల అప్పారావు నేతృత్వంలో సమస్యలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లారు. రహదారుల అభివృద్ధికి రూ.3 కోట్లు మంజూరు కావడంతో అభివృద్ధికి శ్రీకారం చుట్టారు.

చురుగ్గా నిర్మాణ పనులు

జ్ఞానాపురం నుంచి ఎన్ఏడీ కొత్తరోడ్డు వరకు బీఆర్‌టీఎస్ రహదారుల్లో తారురోడ్డు (బీటీ) రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. బీటీ రోడ్ల నిర్మాణం జరిగిన చోట ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రా క్రాసింగ్‌లు, స్పీడ్ బ్రేకర్లు, డిజిటల్ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నారు. పలు జంక్షన్ల వద్ద బారికేడ్లు, కారిడార్లు, ఫుట్‌పాత్‌లను రంగులతో సుందరంగా ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే సుమారు రూ. 1.20 కోట్లతో నిర్మించిన పనులు పూర్తికాగా మరో రూ. 2.90 కోట్ల పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. బీఆర్‌టీఎస్ రహదారుల్లో సమస్యలు పరిష్కారం కావడం, అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతుండడంతో వాహనాదారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శరవేగంగా అభివృద్ధి



గతంలో అభివృద్ధి జాడ ఏనాడూ కనిపించలేదు. నాలుగేళ్ల క్రితం దివంగత సీఎం డాక్టర్ రాజశేఖరరెడ్డి తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నమ్మి ఓటేశాం. మా నమ్మకాన్ని ఆయన నిలబెట్టారు. వార్డులన్నీ అభివృద్ధి చేస్తున్నారు. నిధులు పుష్కలంగా మంజూరు కావడంతో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి.

–బి.శేషు, కంచరపాలెం

స్మార్ట్ వార్డులుగా..



జోన్–5లో వార్డులను స్మార్ట్‌గా తీర్చిదిద్దడమే ధ్యేయం. ముందుగా రహదారులను అభివృద్ధి చేస్తున్నాం. ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం, జీవీఎంసీ, ఎంపీ నిధులు మంజూరు కావడంతో వార్డును అభివృద్ధి శరవేగంగా జరుగుతోంది.

–ఆర్‌జీవీ కృష్ణ, జోనల్ కమిషనర్ జోన్–5

పర్యావరణ చైతన్యానికి కృషి అవసరం

- రెక్టార్ ఆచార్య కె.సమత
- ఏయూలో ఐడీఆర్‌సీ తరగతుల ప్రారంభం



మాట్లాడుతున్న రెక్టార్ ఆచార్య కె.సమత

ఏయూ క్యాంపస్: విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం పెంచే దిశగా అధ్యాపకులు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. మంగళవారం ఏయూ హెచ్‌ఆర్‌డీసీ కేంద్రంలో నిర్వహిస్తున్న పర్యావరణ శాస్త్రంపై పునశ్చరణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రెక్టార్ మాట్లాడుతూ ఇక్కడ నేర్చుకున్న నూతన జ్ఞానాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. సృజనాత్మకత, సహనం, కమ్యూనికేషన్ స్కిల్స్, కాల నిర్వహణ, కాలానుగుణంగా మార్పులను ఆకళింపు చేసుకోవడం వంటి లక్షణాలను అధ్యాపకులు అలవాటు చేసుకోవాలన్నారు. పర్యావరణ మార్పులు పెను సవాళ్లను విసురుతున్నాయన్నారు. ఊహించని విధంగా వరదలు రావడం, ప్రత్యామ్నాయ ఇంధనాలను అన్వేషించడం ఎంతో అవసరమన్నారు. వాయు కాలుష్యం కారణంగా లక్షలాది మంది ప్రతి సంవత్సరం మృత్యువాత పడుతున్నారన్నారు. అనేక పర్యావరణ సంబంధ సమస్యలకు పరిష్కారాలను చూపే దిశగా ఆచార్యులు కృషి చేయాలన్నారు. యువతను తీర్చిదిద్దడంలో అధ్యాపకునికి సహనమే అతిపెద్ద ఆయుధంగా నిలుస్తుందన్నారు.

ఏయూ హెచ్‌ఆర్‌డీసీ కేంద్రం సంచాలకుడు ఆచార్య టి.వెంకటకృష్ణ మాట్లాడుతూ విభిన్న జీవులతో సమన్వయం చేసుకుంటూ సాగడం మానవ జీవన విధానమన్నారు. వైవిధ్య అంశాలు, శాస్త్రాల సమ్మేళనంగా పర్యావరణ శాస్త్రం నిలుస్తుందన్నారు. సహజ వనరుల సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ, పర్యావరణ మార్పులపై అవగాహన, విపత్తులు, వ్యర్థాల నిర్వహణపై అవగాహన పెంచుకోవాలన్నారు. సదస్సు కన్వీనర్ ఆచార్య ఇ.ఉదయ భాస్కరరెడ్డి, ఆచార్య ఎస్.ఎ.డి.పాల్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలకు మరమ్మతులు

సీతమ్మధార: నగరంలోని ప్రధాన జంక్షన్లలో సీసీ కెమెరాలకు మరమ్మతులు చేశారు. మూడు రోజులుగా గాలి, వర్షానికి సీసీ కెమెరాలు పాడవడంతో జీవీఎంసీ టెక్నీషియన్లు కెమెరాలకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేశారు. సత్యం జంక్షన్‌లో నాలుగు సిగ్నల్స్‌కు ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించారు. హైవే పై పనిచేయని వాటిని సరి చేశారు.

దోమల నియంత్రణకు పటిష్ట చర్యలు



ఓవర్ హెడ్ ట్యాంకులో దోమల మందు కలుపుతున్న యాంటీ లార్వా సిబ్బంది

సీతంపేట: వర్షాకాలంలో విజృంభించే డెంగ్యూ, మలేరియా జ్వరాలను వ్యాప్తి చేసే దోమల నియంత్రణకు జీవీఎంసీ జోన్ 3 యంత్రాంగం పటిష్ట చర్యలు చేపడుతోంది. వారంలో ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే పేరిట జీవీఎంసీ మలేరియా సిబ్బంది, సచివాలయ హెల్త్ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వలను పరిశీలించి దోమలు పెరుగుదలను గుర్తించి లార్వా దశలోనే దోమలను నాశనం చేస్తున్నారు. అలాగే మహిళలకు, డ్వాక్రా సంఘాల సభ్యులకు, ఆర్పీలకు దోమలు పెరిగే ప్రదేశాలు, దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. జీవీఎంసీ మలేరియా సిబ్బంది మంగళవారం ఉదయం 26, 27 వార్డుల్లో ఓవర్ హెడ్ ట్యాంకులు తనిఖీ చేశారు. సాయంత్రం 27వవార్డులోని పలు ప్రాంతాల్లో మెగా ఫాగింగ్ చేపట్టారు. మలేరియా ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ కె.ఎస్.ఎస్.నారాయణ, హెల్త్ అసిస్టెంట్ శివ పర్యవేక్షించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

27వ రోజుకి శ్రావణలక్ష్మి పూజలు

కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు మంగళవారం 27వ రోజుకి చేరాయి. ఉదయం 8 గంటలకు వేద మంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. శ్రావణలక్ష్మి పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో కె. శిరీష తెలిపారు. పూజలకు సంబంధించి వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

14న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 14న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

‘ఏక్ భారత్-శ్రేష్ట్ భారత్’ నిర్మాణమే ప్రధాని లక్ష్యం



కృష్ణానగర్‌లో ఇంటింటికీ వెళ్లి మట్టి సేకరిస్తున్న రవికుమార్

మహారాణిపేట : భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో 29వ వార్డు కృష్ణానగర్‌లో బీజేపీ మెడికల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్ ఇంటింటికీ వెళ్లి తులసి కోటల నుంచి మట్టి సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృతోత్సవ్ ముగింపు సందర్భంగా సాతంత్ర్యం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన వీరులను గౌరవించాలన్నారు. దేశవ్యాప్తంగా అమరవీరులు, పుణ్య మాతృమూర్తులను గౌరవించుకోవడం నా భూమి – నా దేశంలో ముఖ్య ఘట్టం అన్నారు. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన వీరుల స్ఫూర్తితో ప్రతి గ్రామంలో స్థూపాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. సమర యోధుల వివరాలను అందులో పొందుపరిచి భావితరాలకు మార్గదర్శకం చేయాలనేది ప్రధాని ఆలోచన అన్నారు. ఈ సందర్భంగా కృష్ణానగర్, జిల్లా పరిషత్ జంక్షన్ తదితర ప్రాంతాల్లో మట్టి సేకరించారు. ఈ సందర్భంగా నగర ఉపాధ్యక్షురాలు గిరిజ మధురలోని కృష్ణుడు నడయాడిన బృందావనంలో సేకరించిన మట్టిని అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ నగర బీజేపీ ఉపాధ్యక్షుడు చొక్కాకుల రాంబాబు, 29వ వార్డు బీజేపీ అధ్యక్షుడు చంద్రశేఖరరావు, శ్రీను, యువమోర్చా ప్రతినిధి గేదెల శ్రీహరి, అక్కమ్మ, మీరా సాహూ, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆహార పొట్లాల వితరణ



ఆహార పొట్లాలు అందిస్తున్న సంస్థ సభ్యులు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం రైల్వేస్టేషన్ ప్రాంతంలో జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ (జేసీఐ) విశాఖ ప్రైడ్ చాప్టర్ ఆధ్వర్యంలో మంగళవారం పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు.

జేసీఐ వీక్ జైత్రలో భాగంగా సుమారు 200 మంది అనాధలకు ఆహార పొట్లాలు అందజేసినట్లు సంస్థ ప్రతినిధి కటకం చందు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.శోభన్‌బాబు, పీఎస్‌వీ ప్రదీప్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆహారం పంపిణీ చేస్తున్న జేసీఐ ప్రతినిధులు

రోగులకు ఆహారం ప్యాకెట్ల పంపిణీ

మహారాణిపేట : జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్(జేసీఐ) వైజాగ్ ఎక్సలెన్సీ సభ్యులు మంగళవారం ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రిలో రోగులు, వారి బంధువులకు ఆహారం ప్యాకెట్లు పంపిణి చేశారు. సుమారు 500 మంది రోగులు, వారి బంధువులకు ఈ వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో జేసీఐ కోఆర్డినేటర్ షణ్ముం, వీక్ కో ఆర్డినేటర్ ఫణి కళ్యాణ్, సాయి రాహుల్, మోహని, భార్గవి ప్రియ, హిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

కత్తితో కోడలిపై మామ దాడి

అదనపు కట్నం కోసం వేధింపులు



గాయపడిన హారిక

బీచ్‌రోడ్డు : కోడలిపై మామ దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుల్లయ్య కాలేజీ సమీపంలో నివాసముంటున్న బొట్టా అప్పారావు.. తన కుమారుడు మధుసూదనరావుకు పదేళ్ల క్రితం అనకాపల్లికి చెందిన హారికతో పెళ్లి చేశాడు. ఆ సమయంలో ఇచ్చిన లాంఛనాలు కాకుండా అదనంగా మరో రూ.2 లక్షల కట్నం అడగడంతో రెండు కుటుంబాల మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈ విషయంలో కుమారుడు మధుసూదనరావు కూడా భార్య కుటుంబానికి సహకరించటంతో అప్పారావు తట్టుకోలేకపోయాడు. దీంతో కొడుకు, కోడలిని ఇబ్బంది పెట్టడం ప్రారంభించాడు. మూడో అంతస్తులో నివాసం ఉంటున్న తన కుమారుడు ఇంటికి నీటి సదుపాయం నిలిపివేశాడు. దీంతో కోడలు నీటి కోసం సోమవారం దిగువ ఫ్లోర్‌కు రావడంతో చూసి సహించలేని అప్పారావు కత్తితో దాడి చేశాడు. ఆమె తప్పించుకోవడంతో భుజానికి గాయమైంది. విషయం గమనించిన చుట్టు పక్కల వాళ్లు వచ్చి అప్పారావును అడ్డుకున్నారు. అనంతరం హారికను కేజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడా మైదానానికి కంచె ఏర్పాటుకు సన్నాహాలు



కంచె ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు హెల్త్ సిటీని ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాన్ని క్రీడా మైదానంగా ఏర్పాటు చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా సుమారు రెండెకరాల విస్తీర్ణం గల ఈ ఖాళీ స్థలం చుట్టూ కంచె నిర్మించడానికి మంగళవారం విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, స్థానిక కార్పొరేటర్ అక్కరమాని రోహిణి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఇక్కడ క్రీడా మైదానం ఏర్పాటు చేయనున్నామన్నారు. ప్రస్తుతం రూ.50 లక్షలు నిధులతో జీవీఎంసీ దీనికి కంచె ఏర్పాటు చేసి మధ్యలో వాకింగ్ ట్రాక్, ఎర్త్ ఫిల్లింగ్ తదితర పనులు చేపడుతుందని తెలిపారు. రెండు నెలల్లో ఈ పనులు పూర్తి చేయనున్నామన్నారు.